PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :202 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం 14.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS



# వందేమాతరంతో.. పార్లమెంట్‌కు తెర

## ముగిసిన వర్షాకాల సమావేశాలు

- పలు కీలక బిల్లులకు ఆమోదం
- వాయిదాలతో సాగిన సమావేశాలు
- మోదీ, రాహుల్ సహా హాజరైన సభ్యులు

**జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు**

పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు గురువారం ముగిశాయి. చివరి రోజున లోక్‌సభ ప్రారంభమైన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు సభ్యులంతా కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. గీతంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షా కాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది.

ఢిల్లీ. ప్రభాత సూర్యుడు

### వందేమాతరానికి చట్టపరమైన రక్షణ

వందేమాతరం గీతానికి చట్టపరమైన రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన కొద్ది రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటుచేసుకుంది. జాతీయ గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని కొత్త చట్టంలో పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకా విష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20న ప్రారంభమై ఆగస్టు 13న ముగిశాయి. సమావేశాల సందర్భంగా పలు అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో అనేక సందర్భాల్లో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. పేపర్ లీక్ అంశం, విద్యా వ్యవస్థలో సంస్కరణలు, యువతపై పోలీసుల చర్యలు తదితర అంశాలపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశాయి. అదే సమయంలో పలు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం లభించింది.

### లాఠీచార్జ్‌పై ప్రతిపక్షం ఆందోళన

పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యాత్రలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనగా పోలీసులు లాఠీచార్జ్ చేశారని, పలువురు గాయపడ్డారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ అంశంపై పార్లమెంట్‌లో విపక్షాలు అధికారపక్షాన్ని గట్టిగా నిలదీశాయి. ఢిల్లీలోయువతపై జరిగినలాఠీ చార్జ్‌కు ఆదేశాలు ఎవరు ఇచ్చారో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై నిరసనలు, ఆందోళనలతో సభా కార్యక్రమాలకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది.

### పలు కీలక బిల్లులకు ఆమోదం

మరోవైపు వర్షాకాల సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతో పాటు పలు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు, నిరసనల నడుమ సాగిన సమావేశాలు చివరకు గురువారం ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడటంతో ముగిశాయి



# నా ప్రసంగం తర్వాత శుద్ధి చేశారు: రాజ్యసభలో ఖర్గే వ్యాఖ్యలు



ఢిల్లీ, ప్రభాత సూర్యుడుపార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్ర మాలను భాజపా ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు.ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తా వించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థి తా..? ఇది భాజపా కార్యకర్తల పనే" అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖర్గేకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరాని తనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు. అయితే, భాజపా కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "భాజపా చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం" అని హామీ ఇచ్చారు.




# ఉచిత కుట్టుమిషన్లు..

## 15 నుంచి దరఖాస్తులు: మంత్రి పొన్నం



హైదరాబాద్:ప్రభాత సూర్యుడు: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు.

# మైనారిటీ రిజర్వేషన్లకు మోదీ, అమిత్ షా వ్యతిరేకం: సీఎం రేవంత్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడుముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

# ప్రజలకు సురక్షితమైన, తాగునీరు అందేలా నీటి శుద్ధి ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి

**బుగ్గపల్లిలోని 75 ఎంఎల్‌డీ మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
**క్షేత్రస్థాయిలోనూ నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలిడ**
**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి ఆగస్టు 13 ప్రభాత సూర్యుడు పెద్దమందడి మండలం బుగ్గపల్లి వద్ద ఉన్న 75 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కను నాటారు. అనంతరం మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకట రమణతో కలిసి నీటి శుద్ధి ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ప్లాంట్‌లో నీటి ప్రవాహం, ఫిల్టరేషన్ ప్రక్రియకు సంబంధించిన ఫ్లో డయాగ్రామ్‌ను కలెక్టర్ పరిశీలించారు. గౌరిదేవిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు ప్లాంట్‌కు ఏ విధంగా చేరుతుంది, ప్లాంట్‌కు చేరిన అనంతరం వివిధ దశల్లో నీటిని ఏ విధంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్‌లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించారు. నీటి వడపోత (ఫిల్ట్రేషన్) ప్రక్రియ, నీటి నాణ్యతను పరీక్షించే విధానం, శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నుంచి ప్రజలకు సరఫరా చేసే సమయంలో ఉన్న నీటి నాణ్యత క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరే వరకు అదే స్థాయిలో కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో కూడా నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అంజద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

**కొత్తకోట మండలం అమడబాకులలో మైనారిటీ గురుకుల కళాశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి ఆగస్టు 13:( ప్రభాత సూర్యుడు) కొత్తకోట మండలం అమడబాకులలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన, నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ముందుగా కళాశాలలోని స్టాక్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వలు, సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, సరుకులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు. అనంతరం కళాశాలలోని భోజనశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్య, వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, విద్యుత్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ డి ఎస్ సి కార్పొరేషన్ సిరాజుద్దీన్, ఇతర అధికారులు తదితరులు, కలెక్టర్ వెంట ఉన్నారు.



# ప్రముఖ సామజిక వేత్త నారాయణ స్వామి కన్నుమూత

హైదరాబాద్ ఆగష్టు 13 ప్రభాత సూర్యుడుసీనియర్ జర్నలిస్ట్ అమేజింగ్ తెలంగాణా దినపత్రిక ఎడిటర్ పొడిశెట్టి రమేష్ కుమార్ తండ్రి గారు ప్రముఖ సామజిక వేత్త పొడిశెట్టి నారాయణ స్వామి శుక్రవారం తుదిశ్వాస విడిచారు. అమెరికా లో ప్రసిద్ధి అంకాలజీ డాక్టర్ డాక్టర్ కత్తుల సతీష్ నారాయణ స్వామి కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణ స్వామి చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం నారాయణ స్వామి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ సతీష్ ఇంటర్ మీడియట్ వరకు ములుగు లోనే చదువుకున్నానని అయన అన్నారు. తన తండ్రి కత్తుల వెంకటయ్య కు నారాయణ స్వామి మంచి మిత్రుడు అని అయన కొనియాడారు. నారాయణ స్వామి మొదటినించి తన జీవితం ఒక క్రమశిక్షణ తో కూడుకున్నదని అయన పేర్కొన్నారు. అంతే కాకుండా చిన్ననాటి నుండే పిల్లలు క్రమశిక్షణ పొదుపు అవగాహన పెంచే వారాని. సుధాకర్ చిన్న పిల్లల పొదుపు పధకం పేరుతో ఒక పధకాన్ని ప్రారంభించడం జరిగింది. ఇందులో పిల్లలు వారి వద్ద ఉన్న ఒకరుపాయి రెండు రూపాయలు ఉంటే తన వద్దకు వచ్చి ఇచ్చి ఒక కార్డు లో ఎంట్రీ చేపించు కునే వారమని. కార్యక్రమం ములుగు కాంగ్రెస్ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి మాట్లాడుతూ నారాయణ స్వామి నిరాడశీబర జీవితం గడుపుతూ తనకు చేతనైనా రీతిలో సమాజానికి సేవ చేయడం ద్వారా స్థానిక ప్రజల మనస్సులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు అని అన్నారు. డాక్టర్ సతీష్ అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియాన్స్ అఫ్ ఇండియన్ ఆరిజన్ ఎఎపిఐ అధ్యక్షులు గా చాలా సంవత్సరాలు పనిచేశారు. గత నెలలో డా సతీష్ కు అంతర్జాతీయం గా గుర్తింపు పొందిన హేమాటలాజి, అంకలాజిస్ట్, విద్యావేత్త మరియు ఆరోగ్య రంగ నాయకులు సతీష్ గారు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎ టి ఎ )వార్షిక సదస్సు లో ఎక్షలెన్స్ ఇన్ మెడిసిన్ అవార్డు ఎందుకున్నారు.





# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

హైదరాబాద్ ఆగష్టు 13 ప్రభాత సూర్యుడు మీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఫోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000 జరిమానామీర్పేట పోలీస్ స్టేషన్‌లో డిసెంబర్ 2024లో నమోదైన ఫోక్సో కేసులో నిందితుడు మనోజ్ (23 సంవత్సరాలు), 16 సంవత్సరాల మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుడి స్నేహితుడి అమ్మమ్మ ఇల్లు మీర్పేటలో ఉండటంతో అక్కడికి తరచుగా రావడం ద్వారా మైనర్ బాలికతో నిందితుడికి పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను మాయమాటలతో నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తదుపరి పెళ్లి చేసుకుంటానని చెప్పి బాలికను తన స్వస్థలమైన నాగర్ కర్నూల్కు తీసుకెళ్లి సుమారు ఐదు రోజుల పాటు తన ఇంట్లో ఉంచుకుని అక్కడ కూడా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై మీర్పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ అనంతరం ఫాస్ట్ ట్రాక్ ఫోక్సో కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీమతి వి.ఖ. పద్మావతి నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. అలాగే బాధిత బాలికకు రూ.1,00,000 పరిహారం అందించాలని ఆదేశించారు.



# విద్యార్థినీ విద్యార్థులు మీలో దాగివున్న నైపుణ్యాలను తీయడానికే క్విజ్ పోటీల నిర్వహణ..

**ఒకరినొకరు పోటీ తత్వం పెంచుకొని సబ్జెక్టులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలి..**
**ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీలను ప్రారంభించిన ఐటీడీఏ పీవో బి.రాహుల్..**






భద్రాచలం ఆగస్టు 13 ప్రభాత సూర్యుడుగిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాపకశక్తి మరియు వారిలో దాగివున్న నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను వెలికితీయడమే కాక పోటీ తత్వంతో మేధాశక్తిని పెంపొందించుకోవడానికి ఇటువంటి క్విజ్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని, ఈ క్విజ్ పోటీలలో విజయం సాధించిన పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు గురువారం భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీలను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించి విద్యార్థినీ విద్యార్థులతో జరుగుతున్న క్విజ్ పోటీలను తీక్షణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు ఇస్తూ ఏదైనా పోటీలలో పాల్గొనాలంటే తప్పనిసరిగా తదేక దృష్టితో ఆలోచించి, మనసు లగ్నం చేసి పాల్గొంటే తప్పనిసరిగా విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు ఖాళీ సమయాలలో ఒకరికి ఒకరు జనరల్ నాలెడ్జ్ కి సంబంధించిన ప్రశ్నలు మరియు సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు వేసుకొని జవాబులు చెప్పుకోవడం వలన పాఠాలు ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పుడు కూడా సులభంగా అర్థమవుతుందని అలాగే పరీక్షలు అప్పుడు కూడా ఎటువంటి భయాలు గాని సందేహము గాని మనసులో రాకుండా పరీక్షలు బాగా రాసి అత్యుత్తమ గ్రేడ్లలో పాస్ కావచ్చని ఆయన అన్నారు. ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థినీ విద్యార్థులు పోటీలను స్నేహపూర్వకంగా మాత్రమే చూసి పాల్గొనాలని ఎటువంటి కక్ష సాధింపులు మనసులో పెట్టుకోవద్దని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ పోటీలలో ఓటమి చెందిన అంత మాత్రాన నిరుత్సాహపడవద్దని మరలా గెలవడానికి ముమ్మర ప్రయత్నం చేయాలని అందుకు తప్పనిసరిగా విజ్ఞాన భాండాగారాలకు సంబంధించిన పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించు కోవాలని అన్నారు. పాఠశాలల స్థాయి నుంచి డివిజన స్థాయి అలాగే ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీల వరకు పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. అనంతరం డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని శ్రీమతి చందన మాట్లాడుతూ ఈనెల 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాలల వారీగా క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందని,

ఆ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల నుండి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి ఈ నెల 11న ఏటిడిఓ స్థాయి క్విజ్ పోటీలు జరగగా 12 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అత్యుత్తమంగా ఎంపిక కావడంతో మొత్తం 60 మందికి ఈ రోజున ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందని ఈ పోటీలలో ఏజీహెచ్ఎస్ రొంపేడ్ మొదటి స్థానం, ఏ హెచ్ ఎస్ సర్వారం రెండవ స్థానంలో నిలిచిందని అన్నారు ఈ పాఠశాలలకు పాఠశాల అభివృద్ధి కోసం ప్రోత్సాహకంగా నగదు బహుమతి త్వరలో అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, బీఈడీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భవాని, భద్రాచలం ఏ టి డి వో రాధమ్మ, వైరా ఏటీడీవో రమేష్, ఏ సి ఎం ఓ లు రమేష్, రాములు, క్విజ్ మాస్టర్లు సీనియర్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# పదవ తరగతి పూర్వ విద్యార్థులను సన్మానించిన చేలే నవీన్

**ముఖ్య అతిగా హాజరై న సర్పంచ్ ఆదిలక్ష్మి**

ములుగు ఆగస్టు 13 ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి -2 ఆశ్రమ పాఠశాలలో వంద శాతం పదవ తరగతి ఉత్తిర్ణత సాధించిన పూర్వ విద్యార్థులను గ్రామానికి చెందిన చేలే నవీన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. నవీన్ అమ్మ జ్ఞేపాకర్థం గా పిల్లలకు సానిటరి నాపకిన్స్ సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయురాలు చేతుల మీదుగా గురువారం అందజేశారు. సర్పంచ్ ఆదిలక్ష్మి విద్యార్థులు క్రమశిక్షణ గా ఉండాలని బాగా చదివి ఉన్నతస్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు. చేలే నవీన్ ఈ గ్రామం లో జన్మించి గ్రామానికి సేవ చేస్తుండడం గర్వకారణం అని నర్సింహా మూర్తి, నాగరాజు అన్నారు. తల్లితండ్రులు ఇద్దరు లేకపోయినా తన స్వసక్తి తో ఎదుగుతున్నాడు అని అన్నారు. పుట్టిన ఊరికి మంచి చేయాలనే సంకల్పం కలిగి ఉండడం గొప్ప లక్షణం అన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. లక్ష్యాన్ని కలిగిన వారే ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. ఈ సందర్బంగా పాఠశాల ఆవరణలో పళ్ల మొక్కలు సర్పంచ్, విద్యార్థుల చేత మొక్కలు నా టించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ చేలే సుజాత, తల్లితండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు




# ఎస్సీ కమిటీ హాల్ మిగిలిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం ఆగష్టు13 ప్రభాత సూర్యుడు.భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కమిటీ హాల్‌కు సంబంధించి మిగిలిపోయిన పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సీ కమిటీ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గారు మిగిలిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయిస్తామని, ఇందుకోసం రూ.50 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ కమిటీ హాల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి ఎస్సీ కమిటీ సభ్యుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ నాయకులు చేగుంట శ్రీనివాస్, జెట్టి రాము, రాజబాబు, కృష్ణార్జున్ రావు, రమేష్, అలవాల రాజా తదితరులు పాల్గొన్నారు..






# కారేపల్లిలో ఘనంగా ఫిడెల్ కాస్ట్రో శతజయంతి




ప్రభాత సూర్యుడు ఆగస్టు13-- కారేపల్లి.కారేపల్లిలో ఫిడెల్ కాస్ట్రో శతజయంతి కార్యక్రమాన్ని సీపీఎం సింగరేణి మండల కమిటీ ముక్క సీతారాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోషలిస్టు ఉద్యమ నేత, క్యూబా విప్లవ నిర్మాత, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట యోధుడు ఫిడెల్ కాస్ట్రో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు నరేంద్ర మాట్లాడుతూ ఫిడెల్ కాస్ట్రో ప్రపంచ కార్మిక వర్గానికి, అణగారిన ప్రజలకు స్ఫూర్తిదాయక నాయకుడని పేర్కొన్నారు. ఆయన విప్లవ భావజాలం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సీతారాములు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి : ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

### పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలి.



వెంకటాపురం, ఆగస్టు 13,(ప్రభాత సూర్యుడు)పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేసి పీఆర్సీని ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌న్ను అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్కు మెమోరాండం అందజేశారు. మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్పీసీ జిల్లా నాయకులు పొడెం సమ్మయ్య, ములుకాల వెంకటస్వామి, కాక సమ్మయ్య, కే. సంతోష్, బి. జయరాం, బి. లక్ష్మయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో హైదరాబాద్ ఇరానీ దమ్ చాయ్ ప్రారంభోత్సవం.

### పాల్గొన్న వైరా ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్ నాయక్.

సింగరేణి ఆగస్టు 13 ప్రభాత సూర్యుడు.కారేపల్లి లో హైదరాబాద్ ఇరానీ దమ్ చాయ్ షాప్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తనయుడు విగ్నేష్ నాయక్ పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్ కు ఆత్మీయ స్వాగతం పలికారు. సందర్భంగా వారు తెలుపుతూ హైదరాబాద్ తీరని దమ్ చాయ్ మండల కేంద్రంలో ఉండడం శుభపరిణామం అంటూ షాప్ మరింత అభివృద్ధి చెంది, వ్యాపారం లాభసాటిగా జరగాలని ఆకాంక్షించాలి. ఈ కార్యక్రమంలో విగ్నేష్ నాయక్, కారేపల్లి సర్పంచ్ టోనీ, అడ్డగోడు ఐలయ్య, ఉమా శంకర్,వార్డు సభ్యులు యాకూబ్ ఆలీ, షఫీ, తాజుద్దీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఐటిడిఏ భద్రాచలం వారి సహకారంతో దబ్బానూతల గ్రామపంచాయతీ పరిధిలో కుట్టుమిషన్ టైలరింగ్ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేసిన స్థానిక ఎమ్మెల్యే డా" తెల్లం వెంకట్రావు

భద్రాచలం ఆగస్టు 13 ప్రభాత సూర్యుడు.దుమ్ముగూడెం మండలంలోని దబ్బనూతల గ్రామంలో ఐటీడీఏ భద్రాచలం వారి సహకారం తో గత 72 రోజులు నుండి 30 మంది మహిళలకు కుట్టుమిషన్ టైలరింగ్ శిక్షణ






ఇవ్వడం జరిగింది. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా సర్టిఫికేట్ అందజేయడం జరిగింది, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గం మారుమూల గిరిజన ప్రాంతం దబ్బనూతల గ్రామ మహిళలు వచ్చి కుట్టు మిషన్ టైలరింగ్ శిక్షణ తరగతులు సబ్ సెంటర్ ఏర్పాట చేయాలని కోరగా, ఐటిడిఏ పిఓ రాహుల్ తో మాట్లాడి దబ్బనూతల గ్రామం లో టైలరింగ్ శిక్షణ తరగతులు సబ్ సెంటర్ ను ఏర్పాటు చేయటం జరిగింది అన్నారు, తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి మహిళలను మహారాణులుగా చేయడం లక్ష్యంగా ప్రతి ఐటీడీఏ పరిధిలోని గిరిజన మహిళలకు టైలరింగ్ శిక్షణ తరగతులు, ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా




మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 2 వేలు పైగా మహిళలు కుట్టు మిషన్ టైలరింగ్, కంప్యూటర్ కోర్సులు, శిక్షణ తరగతులు పొందుతున్నారని అన్నారు. ఈ యొక్క శిక్షణ తరగతులు అందరూ ఉపయోగించుకొని సామాజికంగా, ఆర్థికంగా ముందుకెళ్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ హరికృష్ణ మేనేజర్ శ్రీను, కుట్టు మిషన్ టైలరింగ్ ట్రైనర్ తిరుపతమ్మ, స్థానిక సర్పంచ్ తామ బాలరాజు,మాజీ జడ్పీటీసీ అన్నె సత్యాలు, ప్రముఖ కాంట్రాక్టర్ ఎండీ అలీమ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముర్రం వీరభద్రం, సర్పంచులు పొడియం సుబ్బారావు, కల్లూరి ఆదినారాయణ, కుర్సం రవి, ధనలక్ష్మి,కట్టం నాగరాజు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తోట రమేష్, మోతుకూరి శ్రీకాంత్, జెట్టి రామకృష్ణ, కొండపల్లి నరేంద్ర, రాయపూడి అనిల్, తదితరులు పాల్గొన్నారు..

# ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలపై ఉద్యమం ఉధృతం చేస్తాం.

### సమస్యలపై తహసీల్దార్ కు యూఎస్పీసీ వినతి



కారేపల్లి ఆగస్టు 13 ప్రభాత సూర్యుడుఉపాధ్యాయ, విద్యారంగ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) హెచ్చరించింది. గురువారం యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ధశలవారి పోరాటాల పిలుపులో భాగంగా తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు సమస్యలతోకూడిన వినతి ప్రతాన్ని అందజేశారు. ఈసందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు ఏండ్లు గడిచినా నూతన పీఆర్సీని అమలు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల చిన్న చూపే అని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన రూ. కోట్లాది బిల్లులు పెరుకపోయి ఉన్నాయని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. సమస్యలపై ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ సింగరేణి మండల నాయకులు కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్, గురుమూర్తి, మల్లేశ్వరరావు, బన్సీలాల్, ఈరు నాయక్, భూక్య రాంకోటి, యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షులు నాగలక్ష్మి,నాగేశ్వరరావు, కోశాధికారి, ఎఫ్ బ్ల్యూఎఫ్ కన్వీనర్ వీ నాగేశ్వరావు, కార్యదర్శులు రామకృష్ణ, సంతులాల్,రామారావు, శివకోటి, బాలకృష్ణ, లకుపతి, భాస్కరరావు, శ్రీలత, సునీత, అప్పారావు, వీ. శ్రీనివాసరావు, రాజారావు, చిన్నారాములు, సోమ్లా, శ్యామ్ ప్రసాద్, మురళీ, కిషన్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానం కొత్త జీవితాన్ని ప్రసాదించే గొప్ప కార్యం: డాక్టర్ శ్రీ భూషణ్ రాజు

### ప్రపంచ అవయవ దాన దినోత్సవ సందర్భంగా 'వార్త' - మీడియా కార్యశాలను నిర్వహించిన పీఐబీ హైదరాబాద్

హైదరాబాద్ ఆగష్టు 13 ప్రభాత సూర్యుడు ప్రపంచ అవయవ దాన




దినోత్సవం సందర్భంగా, హైదరాబాద్ కవాడిగూడలోని సిజీవో టవర్స్ వేదికగా 'అవయవ దానం: అపోహలు - వాస్తవాలు' అంశంపై 'వార్త' పేరుతో మీడియా కార్యశాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిర్వహించింది. నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్, అధిపతి... ఎన్‌వోటీటీవో (జీవన్‌దాన్) విభాగ అధిపతి డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పీఐబీ, హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ (ఐఐఎస్) ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ "దేశంలో అవయవ మార్పిడికి ఉన్న డిమాండ్, దాతల ద్వారా అందుబాటులో ఉన్న అవయవాల మధ్య గణనీయ వ్యత్యాసం ఉంది. అవయవ దానాన్ని, మార్పిడి ప్రక్రియలను సమన్వయం చేయడంలోనూ, ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించడంలోనూ ఎన్‌వోటీటీవో, ఎస్‌వోటీటీవోలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 'వార్త' వంటి మీడియా కార్యశాలల ద్వారా... అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడంతో పాటు, ఈ అపోహలకు-వాస్తవిక వైద్యపరమైన అంశాలకు మధ్య వ్యత్యాసాన్ని వివరించే సమాచారాత్మక సదస్సులను మేం నిర్వహిస్తున్నాం" అన్నారు.నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెఫ్రాలజీ ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ప్రసంగిస్తూ... "మరణించిన వ్యక్తి మరొక వ్యక్తికి జీవితాన్ని అందించగల ఒక ఉదాత్తమైన చర్యగా అవయవ దానాన్ని మనమంతా... ఈ ప్రపంచ అవయవ దాన దినోత్సవ సందర్భంగా గుర్తించాలి. అవయవ మార్పిడిలో వైద్య శాస్త్రం అద్భుతమైన పురోగతి సాధించినప్పటికీ, మానవ అవయవాలను పూర్తిగా తిరిగి సృష్టించడం ఇంకా సాధ్యం కాలేదు. అందుకే దాతలు, వారి కుటుంబాల ఉదారత ఎంతో అమూల్యమైనది" అన్నారు.అవయవ మార్పిడిలో ఉండే సంక్లిష్టతలను వివరిస్తూ... మార్పిడి చేసిన అవయవాన్ని మానవ రోగనిరోధక వ్యవస్థ సహజంగానే ఒక అన్య పదార్థంగా గుర్తించి, దానిని తిరస్కరించడానికి ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'వైద్య రంగంలో వచ్చిన పురోగతి వల్ల ఈ రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రించడం, అవయవ మార్పిడి ఫలితాలను మెరుగుపరచడం సాధ్యమైంది. ఈ తిరస్కరణను నివారించడం, గ్రహీతను ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడం మధ్య ఒక సున్నితమైన సమతుల్యతను కాపాడుకోవడం ఇప్పటికీ ఒక ముఖ్యమైన సవాలుగానే ఉంది' అని డాక్టర్ శ్రీ భూషణ్ రాజు తెలిపారు."అవయవ మార్పిడి విజయం అంతిమంగా అవయవాల లభ్యతపైనే ఆధారపడి ఉంటుంది. వైద్య శాస్త్రం అధునాతన మార్పిడి విధానాలు, ఔషధాలను అభివృద్ధి చేసినప్పటికీ... అవయవాలను కర్మాగారాల్లో తయారు చేయడం సాధ్యం కాలేదు. అందువల్ల, అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు కొత్త జీవితాన్ని పొందేందుకు అవయవ దానం అత్యంత కీలకం" అని ఆయన తెలిపారు.ఎన్‌వోటీటీవో, ఎస్‌వోటీటీవోలతో కలిసి మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం (టీహెచ్‌వోటీఏ)... దేశంలో అవయవ దానం, మార్పిడిల నియంత్రణ, బలోపేతం కోసం ఒక ముఖ్యమైన విధాన ప్రణాళికను అందిస్తోందని ఆయన స్పష్టం చేశారు. జాతీయ కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు, పారదర్శక అవయవ కేటాయింపు వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవయవ దానాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహా దాని పాత్రనూ డాక్టర్ శ్రీ భూషణ్ రాజు ప్రముఖంగా ప్రస్తావించారు. అవయవ దానాన్ని ప్రోత్సహించడం, మార్పిడిని సులభతరం చేయడం, అంతిమంగా అవయవ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు పునర్జన్మను అందించడం ఈ ప్రయత్నాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.అవయవ దానానికి సుముఖంగా ఉన్నప్పటికీ, వారి కుటుంబ సభ్యుల అవయవాలు వైద్యపరంగా సరిపోలని రోగుల విషయంలో స్వాప్-ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక కీలకమైన ఎంపిక అవుతుందని డాక్టర్ భూషణ్ రాజు స్పష్టం చేశారు. ఇటువంటి సందర్భాల్లో తగిన చట్టపరమైన, వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా పరస్పరం సరిపోలే దాత-గ్రహీత జంటలను కలపవచ్చని ఆయన వివరించారు. గతంలో అవయవ దానాన్ని ప్రధానంగా వైద్యపరమైన లేదా శాస్త్రీయ అంశంగానే పరిగణి ంచేవారనీ... ఇది క్రమంగా ఆర్థిక, కుటుంబపరమైన అంశాలతో కూడిన సామాజిక అంశంగా మారుతూ, ప్రస్తుతం డిమాండ్-సరఫరాల మధ్య అంతరానికి కారణమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ అంతరాన్ని పూడ్చడానికి, అవయవ దానాన్ని బహిరంగ చర్చల్లోకి తీసు కురావాలన్నారు. మరింత అవగాహనను, సమ్మతిని కల్పించడానికి కుటుంబాలు, సమాజాల మధ్య చర్చలను ప్రోత్సహించాలని డాక్టర్ భూషణ్ రాజు సూచించారు. అపోహలు, తప్పుడు అభిప్రాయాలను తొలగించి, అవయవ దానంపై అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, విజ్ఞానవంతమైన చర్చలు విస్తృతంగా నిర్వహించాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యశాలలో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అవయవ దానానికి సంబంధించిన వివిధ అంశాలపై సంభాషించారు.నేపథ్యం:దేశంలో అవయవ దానం, మార్పిడి కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపట్టింది. భారత అవయవ దాన దినోత్సవమైన 16వ తేదీన... స్వచ్ఛంద కుటుంబ చర్చలు, ప్రతిజ్ఞలను ప్రోత్సహించడానికి "జుగ్ జుగ్ జియో (అంగ్‌దాన్ కరో, జుగ్ జుగ్ జియో)" ఉద్యమాన్ని నేషనల్ ఆర్గాన్ అండ్




టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌వోటీటీవో) ప్రారంభించింది. ప్రజల్లో మరింత అవగాహన కల్పించడం, అవయవ దానాన్ని ప్రోత్సహించడం, దేశవ్యాప్తంగా అవయవ మార్పిడి వ్యవస్థను బలోపేతం చేయడం ఈ ప్రయత్నాల ముఖ్యోద్దేశం. అవయవ దానానికి సంబంధించిన సమాచారం, సహాయం కోసం 1800-11-477 నంబరుతో 24ఇ7 టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంది.



## కింగ్ నాగార్జున జీవితంలో బెస్ట్ ఇన్వెస్టిమెంట్!

టాలీవుడ్ మన్మథుడు, కింగ్ అక్కినేని నాగార్జున కేవలం నటుడిగానే కాకుండా విజయవంతమైన వ్యాపారవేత్తగానూ తనదైన ముద్ర వేశారు. టాలీవుడ్ మన్మథుడు, కింగ్ అక్కినేని నాగార్జున కేవలం నటుడిగానే కాకుండా విజయవంతమైన వ్యాపారవేత్తగానూ తనదైన ముద్ర వేశారు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన -వన్ ఫింగర్ రివొల్యూషన్- (క్యాప్‌స్టన్ యాప్) గ్రాండ్ లాంచ్



ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. ఒక వైపు సినిమాలు, మరోవైపు అన్నపూర్ణ స్టూడియోస్, మీడియా కాలేజ్ బాధ్యతలు నిర్వహిస్తూనే.. వ్యాపార రంగంలోనూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న తీరుపై పలు విశేషాలను వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... తన జీవితంలో అత్యుత్తమ పెట్టుబడి ఏంటని ప్రశ్నించగా..నాగార్జున తడుముకోకుండా -నా ఆరోగ్యమే నా బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్- అని బదులిచ్చారు. 60 ఏళ్లు దాటినా నేటికీ యంగ్‌గా, ఫిట్‌గా కనిపించే ఆయన ఆరోగ్యానికి ఇచ్చే ప్రాధాన్యత గురించి చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకున్నాయి. అలాగే చెత్త ఇన్వెస్టిమెంట్ గురించి ప్రశ్నించగా... జీవితంలో చెత్త ఇన్వెస్ట్‌మెంట్ అంటూ ఏదీ ఉండదని... ప్రతి తప్పు లేదా ఓటమి మనకో మంచి పాఠాన్ని నేర్పి సరైన మార్గాన్ని చూపిస్తుందని స్పష్టం చేశారు. ఇంటి నిర్వహణ- సర్వీసుల గురించి మాట్లాడుతూ...తాము గత 15 ఏళ్లుగా క్యాప్‌స్టన్ సంస్థ సేవలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. తాను తన సతీమణి అమల రోజంతా విభిన్నమైన పనులతో బిజీగా ఉంటామని.. ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్తే రాత్రికి కానీ రామని చెప్పారు. అలాంటి సమయంలో ఇల్లు శుభ్రంగా, ప్రొఫెషనల్‌గా నిర్వహించబడటం చాలా అవసరమని.. ప్రశాంతమైన - ఆహ్లాదకరమైన ఇల్లే సంతోషకరమైన కుటుంబానికి అసలైన పునాది అని నాగార్జున అభిప్రాయపడ్డారు. ఈ రోజుల్లో సాంకేతికత పెరిగిన తీరును వివరిస్తూ... హోమ్ సర్వీసెస్ యాప్స్ భవిష్యత్తులో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని నాగార్జున ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఆన్‌లైన్‌లో కూరగాయలు కొంటామని, లేదా గుర్తుతెలియని వ్యక్తుల బైక్‌లపై రాపిడోలో ప్రయాణిస్తామని ఎవరూ ఊహించలేదని... కానీ నేడు అవన్నీ మన జీవితంలో భాగంగా మారిపోయాయని గుర్తుచేశారు. దాదాపు 18 ఏళ్ల అనుభవం ఉన్న ఇటువంటి విశ్వసనీయమైన సంస్థలు హోమ్ సర్వీసెస్ డిజిటల్ రంగానికి రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని కొనియాడారు. చివరగా ఇంట్లో పనిచేసే సిబ్బందిపై నమ్మకం అనేది వారితో మనకున్న బంధం నుండి వస్తుందని నాగార్జున చెప్పారు. పని పై నిబద్ధత, వర్క్ ఎథిక్స్ ఉన్న సిబ్బంది తన వద్ద దశాబ్దాలుగా పనిచేస్తున్నారని... వారిని కుటుంబ సభ్యుల్లా చూసుకోవడమే సరైన పద్ధతి అని తెలిపారు. సినిమాలు, వ్యాపారం, ఫిట్‌నెస్ ఇలా ప్రతి విషయంలోనూ ఒక క్రమశిక్షణతో వ్యవహరించే నాగార్జున వ్యాఖ్యలు సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతున్నాయి.

## అమ్మ నమ్మింది.. ప్రపంచం చప్పట్లు కొట్టింది!



మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సక్సెస్ వెనుక కేవలం టాలెంట్ మాత్రమే కాదు, ఒక తల్లి నమ్మకం కూడా ఉందని ఆయన చెప్పిన తాజా కామెంట్స్ చెప్తున్నాయిమ్యూజిక్ డైరెక్టర్ తమన్ సక్సెస్ వెనుక కేవలం టాలెంట్ మాత్రమే కాదు, ఒక తల్లి నమ్మకం కూడా ఉందని ఆయన చెప్పిన తాజా కామెంట్స్ చెప్తున్నాయి. చిన్ననాటి నుంచి తన జీవితాన్ని తీర్చిదిద్దిన వ్యక్తి తన తల్లేనని, తాను ఈ స్థాయికి రావడానికి కారణం ఆమె నమ్మకమేనని తమన్ ఎమోషనల్ గా చెప్పుకొచ్చారు. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమన్, తండ్రి చనిపోయిన తర్వాత తన తల్లి ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. కేవలం 33 ఏళ్ల వయసులో భర్తను కోల్పోయిన ఆమెకు కొత్త జీవితం ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ దారిని ఎంచుకోలేదని తెలిపారు. తనని, తన చెల్లిని హాస్టల్‌లో పెట్టి మరో పెళ్లి చేసుకుని తన జీవితాన్ని చూసుకోవచ్చు. కానీ తన తల్లి అలా చేయలేదని, తన లైఫ్ ను పక్కన పెట్టి మరీ కొడుకు టాలెంట్‌ణే నమ్ముకుందని ఆయన అన్నారు. వైరల్ తనకు చిన్నప్పటి నుంచి మ్యూజిక్ పై ఉన్న ఇంట్రెస్ట్‌ను గుర్తించిన తల్లి, కొడుకు డ్రమ్మర్ అవుతాడనే నమ్మకంతో పెద్ద డెసిషన్ తీసుకుందని తమన్ వెల్లడించారు. తండ్రి చనిపోయిన తర్వాత వచ్చిన ఎల్‌ఐసీ డబ్బును కూడా కుటుంబ భద్రత కోసం దాచకుండా, తన మ్యూజిక్ జర్నీ కోసం డ్రమ్స్ కొనిపించిందని చెప్పారు. ఆ టైమ్ లో రూ.60 వేల విలువైన డ్రమ్స్ కొనిపించడం కుటుంబానికి చిన్న విషయం కాదని, కానీ తన తల్లి తన కలను డబ్బు కంటే పెద్దదిగా చూసిందని పేర్కొన్నారు తాను ఇలా ఉన్నానంటే కారణం తన తల్లేనని, ఆమె నమ్మకమే తనకు బలాన్నిచ్చిందని, తన కోసం చేసిన త్యాగాలను లైఫ్ లో ఎప్పటికీ మర్చిపోలేనని తమన్ అన్నారు. చిన్నప్పుడు తాముండే చోట బావి ఉండేదని, అటు వైపు వెళ్లిపోతాననే భయంతో ఎప్పుడూ తనను ఎత్తుకునే తిరిగేదని, చిన్నప్పుడు కూడా తాను ఎంతో లావుగా ఉండేవాడినని, అలాంటి ఆమెను ఇప్పుడు తానే చూసుకోవాల్సిన బాధ్యత ఉందని కూడా తమన్ చెప్పారు. తమన్ మాటల్లో ఎక్కువగా ఆకట్టుకున్న అంశం తల్లి నమ్మకానికి ఆయన ఇచ్చిన విలువ. ఒక తల్లి తన కొడుకుపై ఉంచిన నమ్మకం, అతని కలలను నిలబెట్టేందుకు చేసిన త్యాగం, చివరకు దేశంలోనే ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకరిగా నిలిచే స్థాయికి తీసుకెళ్లిందనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం తమన్ చెప్పిన ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, సక్సెస్ వెనుక ఉన్న ఫ్యామిలీ సపోర్ట్, ముఖ్యంగా తల్లి విశ్వాసం ఎంత కీలకమో మరోసారి గుర్తు చేస్తున్నాయని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

## దుల్కర్ వెనక్కి తగ్గితే అసలు లాభం ఎవరికి?

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. భారీ అంచనాలతో రిలీజ్ డేట్స్ ప్రకటించిన సినిమాలు, చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కారణంగా వాయిదా పడుతున్నాయి. సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. భారీ అంచనాలతో రిలీజ్ డేట్స్ ప్రకటించిన సినిమాలు, చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కారణంగా వాయిదా పడుతున్నాయి. ఇప్పుడు దుల్కర్ సల్మాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఐ యామ్ గేమ్ కూడా అదే లిస్ట్ లో చేరే అవకాశంపై మాలీవుడ్‌లో డిస్కషన్ జరుగుతోంది. ఆగస్టు 20, 2026న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తికాకపోవడంతో రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందనే ప్రచారం ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇది కేవలం ఒక సినిమా పోస్ట్ పోన్ మాత్రమే కాదు. పెద్ద సినిమాల రిలీజ్ ప్లాన్స్ ఎలా మారుతున్నాయనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. గతంలో రిలీజ్ డేట్ అనౌన్స్



చేసిన తర్వాత దానిని మార్చడం అరుదుగా జరిగేది. కానీ ఇప్పుడు యాక్షన్ థ్రిల్లర్లు, విజువల్ ఎఫెక్ట్స్ ఆధారిత సినిమాలు, బహుభాషా రిలీజులతో పోస్ట్ ప్రొడక్షన్ దశ మరింత క్లిష్టంగా మారింది. డబ్బింగ్, డీఐ, సౌండ్ డిజైన్, వీఎఫ్ఎక్స్, సెన్సార్ ప్రక్రియల సమన్వయం కారణంగా ఆఖరి దశలో ఆలస్యాలు పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఐ యామ్ గేమ్ పోస్ట్ పోన్ అయితే దాని ఎఫెక్ట్ బాక్సాఫీస్ ఈక్వేషన్స్ పై కూడా కనిపించే అవకాశం ఉంది. అదే రోజున రిలీజ్ కు రెడీ అవుతున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఖలీఫాకు సోలో రిలీజ్ అడ్వాంటేజ్ దక్కే అవకాశముంటుంది. స్క్రీన్ కౌంట్ పెరగడం, మంచి ఓపెనింగ్స్ రావడం వంటి అంశాలు దానికి అనుకూలంగా మారవచ్చు. మరోవైపు మమిత బైజు నటించిన బేతేళం కుడుంబ యూనిట్‌కు కూడా మల్టీప్లెక్స్ పోటీ తగ్గి ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఎక్కువ షేర్ దక్కే అవకాశాలు పెరుగుతాయి. దీంతో ఆగస్టు 20 మాలీవుడ్ బాక్సాఫీస్ ఈక్వేషన్ పూర్తిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. మూడు సినిమాల మధ్య పోటీ ఉండాల్సిన చోట, రెండు సినిమాల మధ్య ప్రధాన పోటీకి పరిస్థితి చేరుకోవచ్చు. ఈ మార్పు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, థియేటర్ చైన్ల స్క్రీన్ కేటాయింపులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పాన్ ఇండియా మార్కెట్ టార్గెట్ గా రిలీజవుతున్న సినిమాల సంఖ్య పెరగడం కూడా ఈ ట్రెండ్‌కు మరో కారణంగా కనిపిస్తోంది. ఒకేసారి మలయాళం, తెలుగు, తమిళం, హిందీ మార్కెట్లను టార్గెట్ గా చేసుకోవడం వల్ల ప్రతి వెర్షన్‌ను ఒకే స్థాయిలో రెడీ చేయాల్సి వస్తోంది. ఫలితంగా రిలీజ్ డేట్ కంటే క్వాలిటీకు ప్రాధాన్యం ఇస్తూ నిర్మాతలు చివరి నిమిషంలో కూడా డెసిషన్స్ మార్చేందుకు వెనుకాడటం లేదు. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇంకా రానప్పటికీ, ఐ యామ్ గేమ్ చుట్టూ జరుగుతున్న డిస్కషన్ ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. భారీ సినిమాల యుగంలో పోస్ట్ ప్రొడక్షన్ ఇప్పుడు కేవలం టెక్నికల్ దశను కాదు, రిలీజ్ ప్లాన్ ను డిసైడ్ చేసే కీలక అంశంగా మారుతోంది.

## 'ఇరుముడి'పై రవితేజ ఎమోషనల్ వర్డ్స్..!



మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో 'ఇరుముడి' చాలా ప్రత్యేకమైన చిత్రమని ఆయన స్వయంగా వెల్లడించారు. సాధారణంగా సినిమా విడుదల కాకముందే దాని గురించి ఎక్కువగా మాట్లాడని రవితేజ, కేవలం ప్రేక్షకుల స్పందనపైనే నమ్మకం ఉంచుతుంటారు. అయితే 'ఇరుముడి' విషయంలో మాత్రం ఆయన ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఈ చిత్రాన్ని కుటుంబాలకు ఎమోషనల్‌గా అంకితం ఇచ్చారు. "ప్రతి తండ్రికి.. ప్రతి కూతురికి.. ప్రతి కుటుంబానికి ఇది నా అంకితం. నా హృదయానికి ఎంతో దగ్గరైన ఈ సినిమా మీ అందరికీ కూడా అంతే బాగా నచ్చుతుందని నమ్ముతున్నాను.. స్వామియే శరణం అయ్యప్ప" అంటూ రవితేజ ఎమోషనల్‌గా చెప్పుకొచ్చారు. ఈ సినిమాలో ఆయన చేసిన పాత్రలోని నిజాయితీ, ఎమోషన్ ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో బేబీ నక్షత్ర ఆయన కూతురిగా నటించగా, ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా అలరించనుంది. దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్రాన్ని భావోద్వేగభరితమైన దృశ్యరూపంగా మలిచారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది


## 'రాకా'తో అట్లీ ప్లాన్ చేసేది ఇదేనా..?





'పుష్ప' సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో సృష్టించిన ఇంపాక్ట్, సాధించిన క్రేజ్ అసాధారణమైనవి. 'పుష్ప రాజ్'గా ఆయన చూపించిన మేనరిజమ్‌లు, నటన ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసాయి. ఆ ఇమేజ్ నుంచి ప్రేక్షకులను బయటకు తీసుకురావడం అంత తేలికైన విషయం కాదు. అయితే, దర్శకుడు అట్లీ ఇప్పుడు అల్లు అర్జున్‌తో తీస్తున్న 'రాకా' చిత్రం ద్వారా 'పుష్ప రాజ్' ఇమేజ్‌ను పూర్తిగా చెరిపేసి, ఆయనకు ఒక సరికొత్త ఇమేజ్‌ను తెచ్చిపెట్టే మిషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు సినిమాల మధ్య ఎలాంటి పోలికలు ఉండవని సమాచారం. 'రాకా' చిత్రాన్ని ఒక సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫాంటసీ డ్రామాగా అట్లీ మలుస్తున్నాడు. ఇందులో బన్నీ ఒక 'దివ్య యోధుడు' పాత్రలో కనిపించనున్నారు. ఈ రోల్ కోసం అల్లు అర్జున్ గుండు, గ్రే హెయిర్ మరియు ప్రోస్తెటిక్ మేకప్‌తో సరికొత్త లుక్‌లోకి మారబోతున్నారు. దీపికా పదుకొణే, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న మరియు జాన్వీ కపూర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించనుంది.

## సినిమాలకు మించి నిహారిక టార్గెట్ ఇదేనా? ఇండస్ట్రీలో హాట్ టాపిక్!

సోషల్ మీడియాలో నిహారిక చేసే పోస్టులు గమనిస్తే, అవి కేవలం ఫోటో అప్‌డేట్స్‌గా కాకుండా ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఉ



ంటున్నాయి. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరోహీరోయిన్లలో నిహారిక కొణిదెల ప్రయాణం ఎప్పటికప్పుడు కొత్త మలుపులు తిరుగుతోంది. ఒకప్పుడు హీరోయిన్‌గా కెరీర్‌ను కొనసాగించిన ఆమె, ఇప్పుడు నిర్మాతగా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాదు, తన వ్యక్తిగత అభిరుచులను కూడా ఒక ప్రత్యేకమైన గుర్తింపుగా మార్చుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సోషల్ మీడియాలో నిహారిక చేసే పోస్టులు గమనిస్తే, అవి కేవలం ఫోటో అప్‌డేట్స్‌గా కాకుండా ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఉంటున్నాయి. ముఖ్యంగా సంప్రదాయం, మహిళల అనుబంధాలు, స్నేహం, కళాత్మకత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆమె తన డిజిటల్ ప్రెజెన్స్‌ను నిర్మించుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ మార్పు సాధారణ సెలబ్రిటీ సోషల్ మీడియా ట్రెండ్‌కు భిన్నంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తాజాగా గోరింటాకు ఫొటోలను పంచుకున్న నిహారిక, ఆ అనుభవాన్ని స్నేహం మరియు స్త్రీత్వంతో ముడిపెట్టిన విధానం అభిమానులను ఆకట్టుకుంది. సాధారణంగా సెలబ్రిటీలు ఫ్యాషన్ లేదా గ్లామర్ యాంగిల్ లో పోస్టులు చేయడం ఎక్కువగా కనిపిస్తుంటే, నిహారిక మాత్రం ఎమోషన్స్ కు, సంస్కృతికి సంబంధించిన అంశాలను హైలైట్ చేయడం ఆమెకు ప్రత్యేక గుర్తింపును



తెస్తోందని సోషల్ మీడియా పరిశీలకులు అంటున్నారు. నిర్మాతగా కూడా నిహారిక తీసుకుంటున్న డెసిషన్స్ ఆసక్తికరంగా మారుతున్నాయి. పెద్ద స్టార్ ప్రాజెక్టుల కంటే కథలకు ప్రాధాన్యం ఇచ్చే సినిమాలను ఎంపిక చేసుకోవడం, కొత్త డైరెక్టర్లు మరియు నటీనటులకు అవకాశాలు కల్పించడం ద్వారా తన బ్యానర్‌కు స్పెషల్ ఇమేజ్‌ను తీసుకురావాలని ఆమె ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కమిటీ కుర్రోళ్లు తర్వాత ఆమె బ్యానర్‌పై వస్తున్న ప్రాజెక్టులపై ఇండస్ట్రీలో ఆసక్తి పెరిగింది. మరోవైపు, నిహారిక తన పర్సనల్ బ్రాండ్‌ను కూడా జాగ్రత్తగా నిర్మించుకుంటున్నట్లు కనిపిస్తోంది. నటిగా వచ్చిన గుర్తింపును దాటి, నిర్మాత, క్రియేటివ్ పర్సన్, సాంస్కృతిక విలువలను గౌరవించే మహిళ అనే మూడు కోణాల్లో తనను తాను ప్రజెంట్ చేయడం ఆమె కెరీర్‌లో దీర్ఘకాలికంగా ఉపయోగపడే వ్యూహమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం నిహారిక జర్నీ చూస్తుంటే, ఆమె కేవలం సినిమాలు నిర్మించడం కాదు.. తన ఆలోచనలు, అభిరుచులు, విలువలను ప్రతిబింబించే ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555